

11న డిగ్రీ పరీక్షలు

- బంద్ కారణంగా వాయిదా పడిన పరీక్షల నిర్వహణ
- షెడ్యూల్ విడుదల చేసిన ఏయూ అధికారులు

... వివరాలు 8వ పేజీలో

రహదారుణం

అధ్వానంగా పెద్దగడ్డ-కొండవంచుల రోడ్డు

- గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.1.75 కోట్లు విడుదల
- ఐదేళ్లు నిర్లక్ష్యం చేసిన వైసీపీ పాలకులు
- వెనక్కి మళ్లిన నిధులు
- వర్షాలకు దారుణంగా తయారైన రోడ్డు
- రాకపోకలకు అవస్థలు పడుతున్న ఆదివాసీలు
- కూటమి ప్రభుత్వం రావడంతో చిగురిస్తున్న ఆశలు



పెద్దగెడ్డ-కొండవంచుల రోడ్డుపై ఏర్పడిన మడుగు

చింతపల్లి, జూలై 9: **మండలంలో అర్ధంతరంగా నిలిచిపోయిన పెద్దగడ్డ-కొండవంచుల రహదారి దారుణంగా తయారైంది. ఈ రోడ్డుపై భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో రాకపోకలకు గిరిజనులు అవస్థలు పడుతున్నారు.**



అధ్వానంగా తయారైన పెద్దగెడ్డ-కొండవంచుల రహదారి

చింతపల్లి-నర్సీపట్నం ప్రధాన రహదారిలో పెద్దగెడ్డ నుంచి కొండవంచుల వరకు గతంలో మెటల్ రోడ్డు నిర్మించారు. గత టీడీపీ ప్రభుత్వం 2018లో ఈ రహదారిపై తారురోడ్డు నిర్మాణానికి 1.75 కోట్లు విడుదల చేసింది. దీంతో కాంట్రాక్టర్ ఎర్తువర్క్ పనులు కొంతవరకు చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్డు నిర్మాణాలకు బ్రేక్ పడింది. రహదారి పనులు వైసీపీ ప్రభుత్వం కొనసాగించపోవడంతో నిధులు వెనక్కి మళ్లాయి. వైసీపీ నాయకులు, అధికారులు ఈ రహదారికి నిధులు మంజూరు చేస్తామంటూ ఐదేళ్లు కాలయాపన చేశారు. కానీ నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ మార్గం అధ్వానంగా తయారైంది. దీంతో ఆదివాసీలు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. వాహనాల్లో ప్రయాణించే గిరిజనులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు.

24 గ్రామాల ప్రజలకు ఆధారం..

పెద్దగెడ్డ-కొండవంచుల రహదారి 24 గ్రామాల గిరిజనులకు ఆధారం. ప్రతి రోజూ ఆదివాసీలు వివిధ పనులు నిమిత్తం మండల కేంద్రానికి వస్తుంటారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు ఈ మార్గంపైనే వెళుతున్నారు. గిరిజనులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను అతి కష్టంపై సంతలకు తరలించి విక్రయించుకుంటున్నారు. వ్యవసాయ ... మిగతా 8వ పేజీలో

మంత్రి సంధ్యారాణి దృష్టికి రహదారి సమస్య



పెద్దగెడ్డ-కొండవంచుల రహదారి సమస్యను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి దృష్టికి తీసుకు వెళతాను. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రహదారి పూర్తి కాలేదు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాను. కూటమి ప్రభుత్వం రహదారులు, తాగునీటి పథకాలు, విద్యుత్ సదుపాయాలకు ప్రాధాన్యమిస్తుంది. కూటమి ప్రభుత్వ హయాంలో పెద్దగెడ్డ-కొండవంచుల రహదారి నిర్మాణం జరుగుతుందనే నమ్మకం ఉంది.

- బేరా సత్యనారాయణ పడాల్,
టీడీపీ అరకు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి

గంజాయి సాగు, రవాణాపై ఉక్కుపాదం


గంజాయి కంపు వదిలేనా..?

గంజాయిపై శనివారం ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం క్లిప్పింగ్

చెక్‌పోస్టుల వద్ద నిఘాను పటిష్టం చేయండి

- గిరిజన రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహించాలి
- అధికారుల సమావేశంలో కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్
- గంజాయి సాగు నిర్మూలనకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ తుహిన్‌సిన్హా



మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన జేసీ భావన వశిష్ఠ, పీవో అభిషేక్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాడేరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు, రవాణాపై ఉక్కుపాదం మోపాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. శనివారం 'గంజాయి కంపు వదిలేనా..?' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ స్పందించారు. ఈమేరకు మన్యంలో గంజాయి నిర్మూలనపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేశ్‌కుమార్ మాట్లాడుతూ.. చెక్‌పోస్టుల వద్ద పటిష్ఠ నిఘా పెట్టి గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. గంజాయి సాగు చేస్తున్న భూములను గుర్తించి, ఆ పట్టాలను రద్దు చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. అనంతరం గంజాయి సాగు చేస్తున్న రైతులను గుర్తించి, వారిని ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలన్నారు. గంజాయి సాగు వల్ల కలిగే నష్టాలపై గిరిజన రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పరివర్తన కార్యక్రమంలో గంజాయి సాగుకు దూరమైన రైతులకు పండ్ల మొక్కలను అందించాలన్నారు. అలాగే డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాల్లో గంజాయి వినియోగం జరగకుండా విద్యార్థులకు అవగాహన కల్పించాలని, డీ.అడిక్షన్ సెంటర్లు, మానసిక వికాస కేంద్రాల ద్వారా గంజాయి వినియోగిస్తున్న వారిలో మార్పు తీసుకు రావాలన్నారు. అలాగే పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు గంజాయితో పట్టుబడిన వారి వివరాలతో ప్రొఫైల్స్‌ను సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు.




సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

గంజాయి సాగు నిర్మూలనకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ

ఏజెన్సీలో గంజాయి సాగును నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. కలెక్టర్ నిర్వహించిన సమావేశంలో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీలో కొయ్యూరు, అనంతగిరి మండలాలు మినహా తొమ్మిది మండలాల్లో గతంలో 7,500 ఎకరాల్లో గంజాయి పంటను సాగు చేసేవారన్నారు. పోలీసు శాఖ ప్రత్యేక చర్యల్లో భాగంగా పరివర్తన కార్యక్రమం ప్రభావంతో దానిని 1,039 ఎకరాలకు తగ్గించామన్నారు. క్రమంగా ఆ పంటను సైతం ధ్వంసం చేశామన్నారు. అలాగే గిరిజనులను గంజాయికి దూరం చేసి ప్రత్యామ్నాయ పంటల వైపు నడిపించామన్నారు. అలాగే చట్టపరమైన చర్యల్లో భాగంగా గంజాయి సాగు చేసిన రైతులు, గంజాయి పండించిన భూములకు సంబంధించిన వ్యక్తులపైనా కేసులు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, డీఎఫ్‌వో వినోద్‌కుమార్, ఆర్‌డీవో బి.పద్మావతి, జిల్లా ఎస్‌ఈబీ అధికారి శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సీఎం రాక రేపు

అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడిలో పోలవరం ఎడమ కాలువ పరిశీలన



- అనంతరం భోగాపురం పయనం...
- విమానాశ్రయం పనులపై సమీక్ష
- అక్కడ నుంచి ఏపీ మెడ్‌టెక్‌జోన్‌కు రాక
- కొత్త భవనాల ప్రారంభం
- విమానాశ్రయంలో అధికారులతో సమావేశం
- సీఎం పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి అనిత ఆదేశం

విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం ఉమ్మడి విశాఖ జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.10 గంటలకు అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడి చేరుకుంటారు. అక్కడ పోలవరం ఎడమ ప్రధాన కాలువను పరిశీలిస్తారు. దార్లపూడి ... మిగతా 8వ పేజీలో

కుండపోత

అరకులోయ, చింతపల్లి, జీకేవీధి, ముంచంగిపుట్టు, కొయ్యూరుల్లో భారీ వర్షం

- పొంగుతున్న వాగులు, గెడ్డలు
- కొట్టుకుపోయిన వరి నారుమడులు
- కోతకు గురైన రహదారులు



అరకులోయలో వర్షం

గూడెంకొత్తవీధి/అరకులోయ/ముంచంగిపుట్టు/కొయ్యూరు, జూలై 9: పాడేరు మన్యంలో పలు మండలాల్లో మంగళవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నారుమడుల్లో వేసిన వరి విత్తనాలు వరద నీటికి కొట్టుకుపోయాయి. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, సాయంత్రం నుంచి రాత్రి వరకు చింతపల్లి, జీకేవీధి మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. అరకులోయలో మధ్యాహ్నం 11 గంటల నుంచి గంటపాటు భారీ వర్షం పడింది. మధ్యాహ్నం మరోసారి కుండపోతగా వర్షం కురవడంతో పలు చోట్ల రోడ్లపై నీరు నిలిచింది. రోజంతా వాతావరణం మబ్బు పట్టి ఉంది. ముంచంగిపుట్టు మండలంలో ఏకధాటిగా కురిసిన వర్షానికి వాగులు, మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండల కేంద్రం నుంచి జోలాపుట్టు, పెదబయలు, సంగడ, కుమడ, లక్ష్మీపురం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులు పలుచోట్ల కోతకు గురయ్యాయి. మట్టి రహదారులు బురదమయంగా మారాయి. దీంతో అటుగా వాహన రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. కొయ్యూరు మండలంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటలపాటు భారీ వర్షం కురిసింది. దీంతో కొండవాగులు పొంగి వరి ఆకుమడులలో పోసిన విత్తనాలు వరద నీటికి కొట్టుకుపోయాయి. యు.చీడిపాలెంతోపాటు మరో 10 గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిలో గొట్టెలపాడు వద్ద, పలకజీడి మీదుగా ఎర్రగొండ, నక్కలమెట్ట తదితర మరో 12 గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిలో గల జంగాలతోట, ఈదులబంద, వేమనపాలెం వద్ద బండిగెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కాకరపాడు, శింగవరం ఐటీడీఏ కాలనీ వద్ద వట్టివాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. ముఖ్యంగా రావణాపల్లి, అంతాడ, బంగారమ్మపేట, నల్లగొండ, తదితర మరో నాలుగు పంచాయతీలలో ఆది, సోమవారాల్లో రైతాంగం సిద్ధం చేసిన నారుమడుల్లో చల్లిన వరి విత్తనాలు వరద నీటికి కొట్టుకుపోయాయి.



యు.చీడిపాలెం వెళ్లే మార్గంలో గొట్టెలపాడు వద్ద రోడ్డుకు అడ్డుగా ప్రవహిస్తున్న బండిగెడ్డ



వరి నారుమడిలో నిలిచిన నీరు



పాడేరు-పెదబయలు రహదారిలో చింతలవీధి జంక్షన్ వద్ద చెరువును తలపిస్తున్న దృశ్యం

చెరువులా చింతలవీధి జంక్షన్

వర్షం పడితే రోడ్డుపై నిలిచిపోతున్న నీరు

- ఇళ్లలోకి వెళుతున్న వర్షపు నీరు
- హైవే అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించకపోవడంతో సమస్య

పాడేరురూరల్, జూలై 9: మండలంలోని చింతలవీధి జంక్షన్ వర్షం కురిస్తే చెరువును తలపిస్తోంది. నేషనల్ హైవే అథారిటీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం జంక్షన్ వాసులకు శాపంగా మారింది. వర్షం పడితే జంక్షన్ చెరువులా తయారై నివాసితులకు కంటి నిండా కునుకు లేకుండా పోతోంది. వర్షపు నీరు ఇళ్లలోకి వెళుతుండడంతో ఇబ్బంది పడుతున్నారు. అయినా హైవే అధికారుల్లో చలనం లేకుండా పోయిందని చింతలవీధి జంక్షన్ వాసులు విమర్శిస్తున్నారు.

ఎన్‌హెచ్‌ఈ 516 (హైవే) రహదారి నిర్మాణ అధికారుల నిర్లక్ష్యం చింతలవీధి గ్రామ ప్రజలకు శాపంగా మారింది. ఈ రోడ్డుకు ఇరువైపులా సైడ్ కాలువలు నిర్మించకపోవడం, రహదారి నిర్మాణ సమయంలో వినియోగించిన మట్టి తొలగించకపోవడంతో చింతలవీధి జంక్షన్‌లో ఉంటున్న ఇళ్లలోకి వర్షపు నీరు వెళ్తున్నది. దీంతో ఇళ్ల యజమానులు తీవ్ర ఇక్కట్లు పడతున్నారు. చింతలవీధిలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు కురిసిన భారీ వర్షానికి పాడేరు-అరకు-పెదబయలు ప్రధాన రహదారి పక్కనే నివాసం ఉంటున్న ప్రజల ఇళ్లలోకి భారీగా వర్షం నీరు వెళ్లింది. నీరు వెళ్లడంతో ఇంట్లో వస్తువులు పాడయ్యాయి. వర్షం పడితే చింతలవీధి జంక్షన్ చెరువును తలపిస్తున్నది. దీంతో ఆ మార్గంలో ప్రయాణం చేసే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టరు నిబంధనలకు నీళ్ల వదలడమే ఈ సమస్యకు కారణమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి చింతలవీధి జంక్షన్‌లో నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గ్యాస్ కనెక్షన్ ఈకేవైసీ కోసం క్యూలో ఉన్న గిరిజన లబ్ధిదారులు

'గ్యాస్' ఈకేవైసీకి బారులు

- ఉచిత సిలెండర్లు అందవని ఆందోళన

చింతపల్లి, జూలై 9: ఉచిత గ్యాస్ సిలెండర్ల కోసం ఈకేవైసీ చేయించుకునేందుకు మంగళవారం చింతపల్లి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద లబ్ధిదారులు బారులు తీరారు. ఎన్నికల ముందు కూటమి మేనిఫెస్టోలో ప్రతి కుటుంబానికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందజేస్తామని ప్రకటించింది. ఉచిత గ్యాస్ సిలెండర్లకు తామెక్కడ దూరమైపోతామోనని ఆందోళన చెందుతూ ఈకేవైసీ చేసుకునేందుకు గిరిజనులు భారీగా తరలివచ్చారు. ఆదివాసీలు గ్యాస్ సిలెండర్లు కొనుగోలు చేసే ఆర్థిక పరిస్థితి లేక కొన్నేళ్లుగా గ్యాస్ వినియోగించడం లేదు. సిలెండర్లు కొనుగోలు చేయకపోవడం వల్ల కొన్ని ఖాతాలు అప్‌డేట్‌లో లేవు. దీంతో హెచ్‌పీ గ్యాస్ లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాలని గ్యాస్ ఏజెన్సీ జీసీసీ అధికారులు గ్రామాల్లో ప్రచారం చేశారు. దీంతో చింతపల్లి, జీకేవీధి మండలాల నుంచి లబ్ధిదారులు అధిక సంఖ్యలో చింతపల్లి గ్యాస్ ఏజెన్సీ వద్దకు వచ్చారు. ఉచిత గ్యాస్ పంపిణీకి సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి మార్గదర్శకాలు విడుదల చేయలేదు. అయినా హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ అధికారులు ప్రస్తుతం గ్యాస్ అకౌంట్‌లకు ఈకేవైసీ చేస్తున్నారు.

క్రైం... crime news

'ఫార్మా' బస్సు ఢీకొని యువకుడి మృతి

కశింకోట, జూలై 9: లారస్ ఫార్మా కంపెనీకి చెందిన బస్సు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ రమేశ్ బాబు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కోటవురట్ల మండలం కొడవటిపూడి గ్రామానికి చెందిన కె.రాజేశ్(27) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అయితే సోమవారం రాత్రి విశాఖపట్నం వెళ్లేందుకు రాజేష్, అతని తండ్రి కె.దొరబాబు ద్విచక్రవాహనంపై కోటవురట్ల నుంచి బయలుదేరారు. మార్గమధ్యంలో కన్నూరుపాలెం రోడ్డులో లాలంకొత్తూరు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారస్ ఫార్మా కంపెనీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న రాజేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో హుటాహుటిన స్థానికులు 108 అంబులెన్స్ సహాయంతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ఎనిమిది ఇళ్లలో చోరీలు

» ఓ ఇంట్లో తులమున్నర బంగారం, రూ.20వేల నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తున్న క్లూస్ టీం

కశింకోట, జూలై 9: మండలంలోని నూతనగుంట పాలెం(ఎన్‌జీపాలెం) పంచాయతీలో సోమవారం రాత్రి వరుసగా ఎనిమిది ఇళ్లల్లో చోరీ జరిగింది. దీనికి సంబంధించి సీఐ వినోద్ బాబు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గ్రామ శివారున ఉన్న ఎస్సీ కాలనీకి చెందిన పిల్లి సుందరరావు, సతకంపట్టు రోడ్డులో ఉన్న కోరుకొండ మార్రయ్య కలిగట్ల మహాలక్ష్మినాయుడు, చిక్కాల రమణ, కళ్ళం గౌరమ్మ, బొండా వరలక్ష్మి, చిక్కాల రమణమ్మ, అగ్రహారం శ్రీనివాసరావులకు చెందిన ఇళ్ల తాళాలను దొంగలు పగులగొట్టి ఇంట్లోని దుస్తులు, వెండి సామాన్లను చిందరవందర చేశారు. బాధితుల్లో కొందరు బయటకు వెళ్లడం, మరికొందరు పొరుగూరు వెళ్లడంతో ఇంటికి తాళాలు వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. కాగా పిల్లి సుందరరావుకు చెందిన ఇంటి తలుపు గడియ పగులగొట్టి ఉండడంతో విశాఖలో ఉన్న ఆయనకు ఫోను ద్వారా స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో సుందరరావు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని చోరీ జరిగిన ఇంటిని క్లూస్ టీం సహాయంతో తనిఖీలు నిర్వహించారు. ఈ చోరీలో సుందరరావుకు చెందిన ఒక తులమున్నర బంగారం, రూ.20వేలు నగదు అపహరణకు గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

అప్పన్నను దర్శించుకున్న ఎలమంచిలి ఎమ్మెల్యే



కప్పస్తంభం వద్ద ఎమ్మెల్యే విజయ్‌కుమార్ దంపతులు

సింహచలం, జూలై 9: వరాహలక్ష్మీనృసింహస్వామిని మంగళవారం ఉదయం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఏఈఓ ఆనందకుమార్ అధికార లాంచనాలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని,బేడామండప ప్రదక్షిణల తరువాత అంతరాలయంలో ఎమ్మెల్యే గోత్రనామాలతో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు.గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

తెలుగుదేశంతోనే ప్రజా సంక్షేమం

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

» పార్టీ కార్యాలయంలో ఎంపీ, ఎమ్మెల్యేలకు ఘన సత్కారం



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును సత్కరిస్తున్న నాయకులు

విశాఖపట్నం, జూలై 9: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాతే ప్రజలంతా సంతోషంగా ఉన్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల ఎన్నికైన పార్టీ ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమం మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు సరైన గుర్తింపునిచ్చేది తెలుగుదేశమేనని అన్నారు. ఐదేళ్లుగా ప్రజలు, టీడీపీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇక నుంచి అలాంటి సమస్య ఎదురవకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పార్టీని అధికారంలోకి తెచ్చారన్నారు. కార్యకర్తలను ప్రభుత్వంలో భాగస్వాములుగా చేయడానికి వీలుగా నామినేటెడ్ పదవుల్లో వారికి స్థానం కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఉత్తరాంధ్రకు అధిక ప్రాధాన్యమిచ్చారని గుర్తు చేశారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ రైల్వేజోన్ సాధన, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కృషిచేస్తామన్నారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసి, ఆర్థిక వనరులు లేకుండా చేసిందన్నారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ వైసీపీపై విసుగెత్తిన ప్రజలు అత్యధిక మెజారిటీతో కూటమి అభ్యర్థులను గెలిపించారన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు మాట్లాడుతూ అధికారానికి అలవాటు పడిన నాయకులు ఇప్పుడు టీడీపీ వైపు వస్తున్నారన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ మాట్లాడుతూ వైసీపీ హయాంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాతే వారంతా ఊపిరి పీల్చుకున్నారన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు.

వరాహావతారంలో జగన్నాథుడు



స్థానిక ఇంద్రద్యుమ్న హాల్‌లో కొలువై ఉన్న సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి మంగళవారం భక్తులకు వరాహావతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. - అనకాపల్లి టౌన్

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	103.00
లైవ్ ధర	123.00
విత్ స్కిన్	216.00
స్కిన్ లెస్	226.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

గిరిజన గ్రామాల్లో జ్వరాలు



జ్వరంతో బాధపడుతున్న పొట్టంగి సంతోష్



వేలంబయలులో జ్వరంతో బాధపడుతున్న జన్నిసామాలమ్మ

» గ్రామ, పీహెచ్‌సీ స్థాయిల్లో అందని వైద్య సేవలు

» మలేరియా పరీక్షలు చేయడం లేదంటున్న గిరిజనులు

» ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న జ్వర బాధితులు

దేవరాపల్లి, జూలై 9: మండలంలోని గిరిజన గ్రామాల్లో జ్వరాలు ప్రబలాయి. గిరిజనులకు సరైన వైద్య సేవలు అందక మంచాన పడుతున్నారు. కొందరు దేవరాపల్లి పీహెచ్‌సీకి వెళ్లినా వైద్య సిబ్బంది పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

మండలంలోని గర్భింగి, చింతలపూడి, వాలాబు, తామరబ్బ గ్రామాల్లో జ్వరాలతో గిరిజనులు మంచాన పడ్డారు. గిరిజనులు జ్వరంతో దేవరాపల్లి పీహెచ్‌సీకి వచ్చినా వైద్య సిబ్బంది పరీక్షలు చేయడం లేదని బాధితులు వాపోతున్నారు. మందులు లేవంటూ ప్రైవేటు ఆస్పత్రులకు పంపుతున్నారని తాటిపూడికి చెందిన జన్ని దేముడు ఆరోపించారు. తాటిపూడి, వేలం బయలు, చింతలపాలెం, నేరళ్లపూడి, సమ్మె, బోడిగరువు, తామరబ్బ, విప్పగరువు, వాలాబు గ్రామాల్లో జ్వరాలు ప్రబలాయని గిరిజనులు తెలిపారు. తాటిపూడి, వేలంబయలు, చింతలపాలెంకు చెందిన జన్ని గంగన్నదొర (47), జన్నిసామాలమ్మ (40), తాటిపూడి, వేలం బయలుకు చెందిన పొట్టంగి సంతోష్(26), మజ్జిహారిక(7), చింతలపాఎంకు చెందిన జన్నిదివ్య(10), జన్ని దేముడు(35)తోపాటు పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. అయితే ప్రైవేటు వైద్యం చేసుకొనే స్థోమత లేక జ్వరాలతో ఇంటి వద్దే మంచాన పట్టారు. క్షేత్రస్థాయిలో జ్వర బాధితులకు సరైన వైద్య సేవలు అందడం లేదు. దేవరాపల్లి పీహెచ్‌సీకి వచ్చినా అదే పరిస్థితి ఉందని గిరిజనులు ఆరోపిస్తున్నారు. జ్వర బాధితులకు మలేరియా పరీక్షలు చేయడం లేదని వారంటున్నారు.


గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలి

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని సీపీఎం మండల కార్యదర్శి బీటీ దొర తెలిపారు. ఆస్పత్రికి వచ్చిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, వైద్య సేవలు అందక గిరిజనులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నారని ఆయన తెలిపారు.

కోనాం జలాశయం గేట్లు మరమ్మతులకు ప్రతిపాదనలు

» రూ.65లక్షలకు పైగా విద్యుత్ బిల్లులు చెల్లింపునకు చర్యలు

» ఇరిగేషన్ ఈఈ త్రినాథం



గేట్లు లీకేజీలను పరిశీలిస్తున్న ఈఈ త్రినాథం



కోనాం జలాశయాన్ని పరిశీలిస్తున్న ఈఈ త్రినాథం

చీడికాడ, జూలై 9: పాలవెల్లి కోనాం జలాశయం గేట్లు మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు నీటిపారుదల శాఖ వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఈఈ) త్రినాథం తెలిపారు. మంగళవారం కోనాం జలాశయంలో నెలకొన్న సమస్యలను ఇరిగేషన్ డీఈఈ చింతల వేణుగోపాలనాయుడుతో కలిసి ఆయన పరిశీలించారు. ముందుగా స్పిల్‌వే గేట్లు లీకేజీలను పరిశీలించారు. అనంతరం అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జలాశయం ఎగువ కాలువ దగ్గర ఉన్న మెయిన్‌గేటు, ఎగువ, దిగువ కాలువల గేట్లు మరమ్మతు పనులకు ఇప్పటికే రూ.25 లక్షలతో ప్రతిపాదనలు పంపించామన్నారు. కోనాం జలాశయానికి సంబంధించి రూ.65 లక్షల విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించని కారణంగా పదేళ్ల క్రితమే జలాశయానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. విద్యుత్ పునరుద్ధరణకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈని ఆదేశించారు. జలాశయం వద్ద సిబ్బంది కొరతపై ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు చెప్పారు. అలాగే పెదకళ్యాణం ఆనకట్ట నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. జలాశయం పరిధిలోని మంగళాపురం ఆనకట్ట నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.40లక్షలు ఎంపీ గ్రాంటు మంజూరు కాగా ఇంకనూ రూ.30లక్షల పనులు చేయాల్సి ఉందన్నారు. మర్లగుమ్మి, శిరిజాం ఆనకట్ల వద్ద తాత్కాలిక పనుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఆయన వెంట ఏఈలు సీహెచ్.జయరాం, ద్వారపురెడ్డి భార్గవకుమార్, సిబ్బంది భాష, షేక్ రసూల్ ఉన్నారు.

జగనన్న కాలనీల్లో అక్రమ కట్టడాలపై దర్యాప్తు చేపట్టాలి

» కూటమి నేతల డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న కూటమి నేతలు

బుచ్చెయ్యపేట, జూలై 9: వడ్డాది జగనన్న కాలనీలోని మూడు లేఅవుట్లలో అక్రమంగా చేపట్టిన ప్రైవేటు ఇళ్ల నిర్మాణాలపై దర్యాప్తు చేపట్టాలని కూటమి నేతలు దాడి సూర్యనాగేశ్వరరావు, కోరుకొండ సూరి అప్పారావు, దొండా నరేష్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గ్రామంలో మూడు జగనన్న లేఅవుట్లలో 279 మందికి ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయన్నారు. ఇందులో 25 మంది అనర్హులుగా అధికారులు గుర్తించి వారికి హౌసింగ్ కాలనీ ఇళ్ల మంజూరు నిలిపివేశారు. అయితే వారికి మంజూరైన స్థలాలను విక్రయించారని కూటమి నేతలు ఆరోపించారు. ఈ స్థలాల అమ్మకాల్లో వైసీపీ నాయకుడు చక్రం తిప్పారన్నారు. ఈయనతో ప్రభుత్వ ఉద్యోగులు కుమ్మక్కు కావడంతోనే జగనన్న లేఅవుట్‌ల్లో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయన్నారు. ఈ అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే కాలనీకి ఆనుకుని ఉన్న రక్షిత నీటి పథకం ట్యాంకు సమీపంలో 20 సెంట్లు ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా, ఏడుగురు అక్రమంగా భవన కట్టడాలు చేస్తున్నా, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు చర్యలు తీసుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్రమ కట్టడాలపై విచారణ చేపట్టి, శాఖపరమైన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను డిమాండ్ చేశారు.

టిడ్కో గృహ సముదాయంలో సమస్యల పరిష్కారానికి చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



టిడ్కో గృహ సముదాయం వద్ద దెబ్బతిన్న డ్రైనేజీని పరిశీలిస్తున్న టిడ్కో అధికారులు

ఎలమంచిలి, జూలై 9: ఎట్టకేలకు టిడ్కో గృహ సముదాయంలోని సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టారు. 'టిడ్కో ఇళ్లల్లో ఉండలేం' శీర్షికన ఈ నెల 2న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. టిడ్కో అధికారులు కాలనీ పరిసరాలను, దెబ్బతిన్న డ్రైనేజీలను పరిశీలించారు. వీటితో పాటు మంచినీటి బోర్లు, మోటార్లను పరిశీలించారు. నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేందుకు మూడు కొత్త మోటార్లను తీసుకువచ్చి మంగళవారం ఒకటి అమర్చినట్టు కాలనీవాసులు తెలిపారు. మరో రెండు మోటార్లు బుధవారం అమరుస్తామని సిబ్బంది చెప్పారన్నారు.



మంచినీటి బోర్లకు అమర్చడానికి తీసుకొచ్చిన కొత్త మోటార్లు

అవకతవకలకు పాల్పడిన సొమ్ము రికవరీకి చర్యలు

» సామాజిక తనిఖీల్లో రూ.9.55 లక్షలు దారి మళ్లినట్టు నిర్ధారణ

» ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో హేమలత

పాయకరావుపేట, జూలై 9: గత ఆర్థిక సంవత్సరంలో పాయకరావుపేట మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా జరిగిన ఉపాధి పనులపై ఇటీవల నిర్వహించిన సామాజిక తనిఖీల్లో 11 పంచాయతీల్లో వెలుగుచేసిన అవకతవకల్లో రూ.9.55,980ల నిధులు దారిమళ్లినట్టు నిర్ధారించి బాధ్యుల నుంచి రికవరీకి రంగం సిద్ధం చేస్తున్నట్టు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ హేమలత తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పాయకరావుపేట మండలంలోని 24 పంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రూ.8,23,04,118ల ఖర్చుతో చేపట్టిన 1,254 పనులకు సంబంధించి గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు నిర్వహించిన తనిఖీల్లో గుర్తించిన అవకతవకలపై గత శనివారం పాయకరావుపేటలో డ్వామా పీడీ ఇ.సందీప్ ఆధ్వర్యంలో ప్రజావేదిక నిర్వహించిన విషయం తెలిసిందేనన్నారు. ఈ సందర్భంగా మండలంలో నామవరం పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ రూ.4,89,017ల నిధులు పక్కదారి పట్టించినట్టు నిర్ధారించడంతో ఆ సొమ్మును అతని నుంచి రికవరీ చేయనున్నామన్నారు. అదేవిధంగా ఈదటం పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి రూ.3,06,724లు, గోపాలపట్నం పంచాయతీలో సీనియర్ మేట్ నుంచి రూ.23,205లు, శ్రీరాంపురం పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి రూ.54,505లు, పెదరాంభద్రపురంలో సీనియర్ మేట్ నుంచి రూ.37,112లు రికవరీ చేయనున్నామన్నారు. పాల్మన్‌పేట పంచాయతీలో రూ.28,293లు, మంగవరంలో రూ.1,000లు, పాల్తేరులో రూ.1,530లు, కందిపూడిలో రూ.11,000లు, కుమారపురంలో రూ.11,938లు, రాజగోపాలపురంలో రూ.1,000లు, రాజవరంలో రూ.1,600లు, కేశవరంలో రూ.1,904లు ఆయా పంచాయతీలో అవకతవకలకు పాల్పడిన సిబ్బంది నుంచి రికవరీ చేయనున్నామని ఆమె తెలిపారు.

ఇసుక డిపో వద్ద పటిష్ఠ బందోబస్తు



ఇసుక అమ్మకాలను పర్యవేక్షిస్తున్న మైన్స్‌శాఖ ఏడీ సుబ్బారాయుడు

నక్కపల్లి, జూలై 9: నక్కపల్లి ఇసుక డిపో వద్ద వున్న ఇసుక నిల్వలు తరలిపోకుండా అధికార యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం 26 వేల టన్నుల ఇసుక నిల్వలు నక్కపల్లి డిపో వద్ద వున్నాయి. సోమవారం సాయంత్రం నుంచి అధికారికంగా ఇసుక అమ్మకాలు ప్రారంభమయ్యాయి. జేసీ జాహ్నవి ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం నక్కపల్లి ఇసుక డిపో వద్ద సీసీ కెమెరాలను అమర్చింది. ఇసుక నిల్వలు వున్న ప్రాంతంలో నలువైపులా నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పోలీస్, రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బందిని కూడా ఇక్కడ నియమించారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇసుక అమ్మకాలను మైన్స్ శాఖ ఏడీ సుబ్బారాయుడు పరిశీలించారు. ప్రస్తుతం టన్ను ఇసుక రూ 1,225లు చొప్పున విక్రయిస్తున్నారు. నక్కపల్లి డిపో వద్ద వున్న పాత ఇసుక నిల్వల అమ్మకాలు పూర్తయితే, ఆ తరువాత ఇసుక ధర బాగా తగ్గుతుందని భావిస్తున్నారు.

ఆరేళ్ల తరువాత మళ్లీ సీఎం హోదాలో బాబు రాక

» ఘన స్వాగతం పలికేందుకు సన్నాహాలు



ఎస్.రాయవరం మండలం గుడివాడలో 2018 జూలై 31న సీఎం హోదాలో గ్రామదర్శిని సభను నిర్వహిస్తున్న చంద్రబాబు (ఫైల్)

నక్కపల్లి, జూలై 9: ఆరేళ్ల తరువాత ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు పాయకరావుపేట నియోజకవర్గానికి మళ్లీ ఈ నెల 11న రానున్నారు. 2014లో సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత అదే సంవత్సరం ఆగస్టులో నక్కపల్లి, ఉపమాక గ్రామాల్లో ఆయన పర్యటించారు. 2018 జూలై 31న గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా చంద్రబాబునాయుడు సీఎం హోదాలో ఎస్.రాయవరం మండలం గుడివాడ పంచాయతీ పరిధిలో పర్యటించారు. దాదాపు 6 గంటల పాటు ఆయన గుడివాడలోనే ప్రజలతో మమేకమయ్యారు. మళ్లీ ఇప్పుడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లోనే పాయకరావుపేట నియోజకవర్గానికి ఆయన ముఖ్యమంత్రి హోదాలో రానున్నారు. ఈ నెల 11న ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద అసంపూర్తిగా నిలిచిన పోలవరం ఎడమ ప్రధాన కాలువను సీఎం చంద్రబాబు పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబుకు ఘనస్వాగతం పలికేందుకు హోం మంత్రి నేతృత్వంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉచిత ఇసుక పాలసీతో నెరవేరనున్న పేదల సొంతింటి కల

» మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు



మాట్లాడుతున్న బుద్ధ నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, జూలై 9: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీతో పేదల సొంతింటి కల నెరవేరనుందని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం చేపట్టి రెండు నెలల్లోనే అమలు చేయడం గొప్ప విషయమన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం ఇసుక మాఫియాను నడిపించి ఇసుక కుంభకోణం ద్వారా రూ.50 వేల కోట్లకు పైగా కొల్లగొట్టారని ఆరోపించారు. సుప్రీంకోర్టు, హైకోర్టు, ఎన్‌జీటీ నిబంధనలకు అనుగుణంగా పర్యావరణం దెబ్బతినకుండా ఉచిత ఇసుక పాలసీని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు బోడి వెంకటరావు, కోట్ని రామకృష్ణదొర, మళ్ల గణేష్, సాలాపునాయుడు, శివన్నారాయణ, తారకేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లకు కౌన్సెలింగ్

కశింకోట, జూలై 9: స్థానిక రాజీవ్ గాంధీ ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో 50 శాతం అడ్మిషన్లకు బుధవారం కౌన్సెలింగ్ జరగనున్నదని ప్రిన్సిపాల్ కర్రి శివ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో చేరేందుకు అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జతల జిరాక్స్ కాపీలతో ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలన్నారు. కళాశాలలో 4 బ్రాంచీలు ఉన్నాయని, వాటిలో మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్ ఉన్నాయని, వీటిలో 30 సీట్లు చొప్పున ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9063297220, 08924220377, 9505504220 ఫోన్ నంబర్లను సంప్రతించాలని ఆయన కోరారు.

97.10 మీటర్లకు చేరిన కోనాం నీటిమట్టం

» 120 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో » వృధాగా పోతున్న 30 క్యూసెక్కులు



కోనాంలో జలాశయంలో కళకళలాడుతున్న నీరు

చీడికాడ, జూలై 9: మండలంలో కోనాం జలాశయం నీటిమట్టం రోజురోజుకీ పెరుగుతుం డడంతో ఖరీఫ్ రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఏజెన్సీలో వారం రోజులుగా వర్షాలు కురుస్తుం డడంతో గెడ్డల ద్వారా జలాశయానికి అధికంగా వర్షపు నీరు చేరుతున్నది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 101.25మీటర్లు కాగా, మంగళవారం ఉదయానికి 97.10 మీటర్లకు చేరుకుంది. కాగా, ఇన్‌ఫ్లో 120 క్యూసెక్కులు కాగా.. రెండు గేట్లు ద్వారా 30 క్యూసెక్కులు వృథాగా పోతున్నది. అయితే గత ఏడాది ఇదేరోజు నాటికి 95.25మీటర్లు నీటిమట్టం ఉందని ఏఈ సీహెచ్.జయరాంపడాల్ తెలిపారు.

ఇసుక అవకతవకలపై టీడీపీ ఫిర్యాదు

నర్సీపట్నం, జూలై 9 : గబ్బాడ ఇసుక డిపోలో ఇసుక నిల్వలు, అక్రమ రవాణాపై విచారణ చేయించాలని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ కలెక్టర్, ఆర్డీవో, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మైనింగ్ అధికారులకు తెలియని ఇసుక లెక్కలు, వివరాలు మాజీ ఎమ్మెల్యే గణేశ్‌కి ఎలా తెలిశాయో తేల్చాలని కోరారు. ఇసుక డిపోలో గబ్బాడకు చెందిన నాగరాజు అనే వ్యక్తి డబ్బులు వసూలు చేసి వేరే వక్తులకు పంపేవాడని, ఆ డబ్బులు ఎవరికి వెళ్లాయో విచారణ చేయాలని, బ్యాంకు ఖాతా ఎవరిదో తేల్చాలని కోరారు.

వంతెనల నిర్మాణం.. ప్రతిపాదనకే పరిమితం!

ప్రమాదకరంగా కాకరపాడు-కొయ్యూరు మార్గం

కోతకు గురైన రహదారి అంచులు

కొండవాగు ప్రవాహంపై శిథిలావస్థలో కాజ్‌వే, వంతెనలు

బిక్కుబిక్కుమంటూ వాహన చోదకుల రాకపోకలు



శింగవరం ఐటీడీఏ కాలనీ వద్ద కూలిపోయే దశలో ఉన్న కాజ్‌వే

కొయ్యూరు, జూలై 9: కాకరపాడు-కొయ్యూరు ప్రధాన రహదారిలో వంతెన నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. ఎప్పుడు కూలిపోతాయో తెలియని వంతెనలు, కాజ్‌వేలు, రోడ్డు పొడవునా కోతకు గురైన అంచులతో ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఎదురుగా వాహనం వస్తే తప్పించలేని దుస్థితిలో రాకపోకలకు వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు.

కాకరపాడు-కొయ్యూరు ప్రధాన రహదారి సుమారు నాలుగు కిలోమీటర్ల విస్తరణలో ఉంది. ఈ రోడ్డును విస్తరిస్తామని గత ప్రభుత్వ హయాంలో ప్రజా ప్రతినిధులు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చకపోవడంతో మండల కేంద్రానికి వెళ్లాలంటే నాలుగు కిలోమీటర్లకు పైగా వాహన చోదకులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు. రెండేళ్ల క్రితం లక్షలు వెచ్చించి మరమ్మతులు చర్యల్లో భాగంగా గోతులు పూడ్చి పైన బీటీతో రోడ్డు వేశారు. అయితే నిర్మాణాలలో తగిన నాణ్యత ప్రమాణాలకు లేకపోవడంతో ఏడాదికే రోడ్డు యథాస్థితికి చేరింది. అప్పటిలో కాకరపాడు సమీప కొండవాగుపైన, శింగవరం ఐటీడీఏ కాలనీ వద్ద వట్టిగెడ్డపై గల



కోతకు గురైన కాకరపాడు-కొయ్యూరు రహదారి అంచులు



కాకరపాడు సమీపంలో కొండవాగుపై ప్రమాదకరంగా మారిన వంతెన

కాజ్‌వే స్థానాలలో వంతెన నిర్మాణాలకు అప్పటి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు రూ2.2 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. వీటికి త్వరలో నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అంతేకాకుండా కొయ్యూరు వరకు ఈ రహదారిని 30 అడుగులు మేర విస్తరిస్తామని తెలిపారు. నేటికీ వంతెనలు నిర్మాణాలకు, రోడ్డు విస్తరణకు ఇచ్చిన హామీలు నెరవేరలేదు. నిధులు మంజూరు చేసిన దాఖలాలు లేవు. దీంతో ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున రహదారి పొడవునా అంచులు కోతకు గురికావడంతో పాటు రెండడుగుల లోతు గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. వర్షం కురిస్తే రెండు కొడవాగు ప్రవాహాల వరదనీటి ఉధృతి పెరిగి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ఈ రహదారిపై ప్రత్యేక దృష్టిసారించి రోడ్డు విస్తరణతో పాటు వంతెనల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని వాహన చోదకులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి, పక్కన నాయకులు

మంత్రి సంధ్యారాణి పర్యటన జయప్రదం చేయాలి

» టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, జూలై 9: గిరిజన, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి పిలుపునిచ్చారు. మంగళవారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా జిల్లా కేంద్రం పాడేరు పర్యటనకు సంధ్యారాణి వస్తున్నారని, నియోజకవర్గంలోని ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. బుధవారం ఉదయం మంత్రి పాడేరు చేరుకొని ముందుగా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే సమీక్షా సమావేశంలో పాల్గొంటారన్నారు. అనంతరం పాడేరులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారని చెప్పారు. మంత్రి సంధ్యారాణికి భారీగా స్వాగతం పలికేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మత్స్యరాజు కుటుంబానికి పరామర్శ


పాము కాటుతో మృతి చెందిన జి.మాడుగుల మండలం వంతాల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత ఐసారం మత్స్యరాజు కుటుంబాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి మంగళవారం పరామర్శించారు. జిల్లా ఆస్పత్రిలో మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి మనోధైర్యం కల్పించారు. మత్స్యరాజు మృతి పార్టీకి తీవ్ర నష్టమని, అతని కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు కేవీ సురేష్‌కుమార్, డప్పోడి వెంకటరమణ, సోమెలి చిట్టిబాబు, లకే రామకృష్ణ, గెమ్మెలి కొండబాబు, వంతాల కృష్ణమూర్తి, కోరాబు శ్రీనివాసనాయుడు, సరసంగి వెంకటరమణ, గెమ్మెలి అప్పారావు పాల్గొన్నారు.

దశలవారీగా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం

» జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు, జూలై 9: గిరి గ్రామాల్లో దశలవారీగా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపడతామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర చెప్పారు. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ సెల్లామ్ గ్రామంలో మంగళవారం డ్రైనేజీ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైనేజీ నిర్మాణానికి జడ్పీ నిధులు రూ.5 లక్షలు కేటాయించినట్టు చెప్పారు. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వాలు పనిచేయాలని ఆమె పేర్కొన్నారు. తన నిధులతో గ్రామీణ ప్రాంతాలలో అవసరమైన ప్రతి చోటా రహదారుల నిర్మాణం చేస్తామని, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే తన తొలి ప్రాధాన్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, జేసీసీ జిల్లా కన్వీనర్ అరబీరు జగబంధు, వైసీపీ నాయకులు పద్మారావు, సన్యాసి, కమల తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కో ఎస్‌ఈ ప్రశాంత్‌కుమార్‌కు సత్కారం



ప్రశాంత్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఇంజనీర్లు, జెన్‌కో సిబ్బంది

సీలేరు, జూలై 9: ఏపీ జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ (సివిల్) కేకేవీ ప్రశాంత్ కుమార్‌ను సీలేరు కాంప్లెక్సు పరిధిలోని ఇంజనీర్లు, సిబ్బంది మంగళవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. రెండున్నరేళ్ల పాటు సీలేరులో ఎస్‌ఈగా కొనసాగిన ప్రశాంత్‌కుమార్‌ను జెన్‌కో కేంద్ర కార్యాలయం విజయవాడ బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పంప్డ్ స్టోరేజీ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఈ (ఓఅండ్‌ఎం) ఎస్‌ఎస్ మీరా, ఈఈలు జి.ప్రభాకరరావు, విజయ్‌కుమార్, వరప్రసాద్, బాలకృష్ణ రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ప్రశాంత్‌కుమార్ సీలేరు కాంప్లెక్సుకు చేసిన సేవలను వారు కొనియాడారు. అనంతరం సన్మాన గ్రహీత మాట్లాడుతూ విధి నిర్వహణలో ఇంజనీర్లు, సిబ్బంది అందించిన సహాయ సహకారాలను మరువలేనన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ నాగేశ్వరరావు, సెక్యూరిటీ ఏఎస్‌ఓ సూర్యమోహన్‌రావు, ఏడీఈ టి.అప్పలనాయుడు, ఏఈఈ సురేష్, ఏఈ అనుదీప్, కార్మిక సంఘాల నాయకులు వై.దారాజు, వై.సత్తిబాబు, జి.శివప్రసాద్, ఎస్.నాగేశ్వరరావు, భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

11న డిగ్రీ పరీక్షలు

బంద్‌తో వాయిదా పడిన పరీక్షలు... ఏయూ అధికారుల షెడ్యూల్ విడుదల

విశాఖపట్నం, జూలై 9 (ఆంధ్రజ్యోతి):

విద్యా సంస్థల బంద్ నేపథ్యంలో వాయిదాపడిన డిగ్రీ పరీక్షను ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నట్టు ఆంధ్ర విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ టి.చిట్టిబాబు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల నాలుగో తేదీన బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ, బీహెచ్‌ఎం విద్యార్థులకు రెండు, నాలుగు సెమిస్టర్ పరీక్షలు జరగాల్సి ఉంది. అయితే, నీట్‌లో జరిగిన అవకతవకలను నిరసిస్తూ విద్యార్థి సంఘాలు ఆరోజు బంద్‌కు పిలుపు నిచ్చాయి. దాంతో ఏయూ అధికారులు పరీక్షలను వాయిదా వేశారు. ఆ రెండు పరీక్షలను 11న నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేశారు. నాలుగో సెమిస్టర్ పరీక్షను 11న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెమిస్టర్ పరీక్షను అదేరోజు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆస్పత్రిలోనే ప్రసవం పొందేలా ఏర్పాట్లు చేసుకోండి

» ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖరరావు



గర్భిణులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖరరావు

చింతపల్లి, జూలై 9: గర్భిణులు తప్పనిసరిగా ఆస్పత్రిలోనే ప్రసవం పొందేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.చంద్రశేఖరరావు సూచించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రధాన మంత్రి సురక్షిత మంత్రిత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 250 మంది గర్భిణులకు స్త్రీ వైద్యనిపుణులు సుధా శారదలు మంగళవారం వైద్య పరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ గర్భిణులతో మాట్లాడుతూ ప్రమాదకర ప్రసవాలు కలిగిన గర్భిణులను గుర్తించి వైద్యులు అప్రమత్తం చేస్తున్నారన్నారు. గర్భిణులు పాటించాల్సిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గర్భిణులు ఆస్పత్రిలో ప్రసవం పొందడం సురక్షితమన్నారు. పురిటి నొప్పులు ప్రారంభమైన తరువాత ఆస్పత్రికి తరలించడం కంటే గర్భిణులు ప్రసవ సమయానికి పది రోజులు ముందుగా చింతపల్లి గర్భిణుల వసతి గృహంలో చేరాలని సూచించారు. గర్భిణులకు పూర్తి స్థాయి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గర్భిణులు, సహాయకులకు భోజనం కూడా అందిస్తామన్నారు. గృహాల్లో ప్రసవం పొందడం మంచిది కాదన్నారు. అలాగే క్రమంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వసతిగృహం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి పాల్గొన్నారు.

కాఫీ పొడి తయారీపై డిగ్రీ విద్యార్థినులకు శిక్షణ



కాఫీ పొడి తయారీపై శిక్షణ ఇస్తున్న టెక్నోమార్క్, వాల్‌మార్టు అసోసియేట్

అరకులోయ, జూలై 9: అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన అరకు కాఫీ పొడి తయారీపై డిగ్రీ విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. అరకులోయ మహిళా డిగ్రీ కళాశాలలో ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్ ట్రైనింగ్ ఆన్ కాఫీ ప్రోసెసింగ్ కార్యక్రమాన్ని టెక్నోసర్వ్ వాల్‌మార్టు ఫౌండేషన్, యూఎస్‌ఎస్‌ఏ డిపార్టుమెంట్ ఆఫ్ ఎకనామిక్స్ అధ్యాపకురాలు డాక్టర్ లక్ష్మీ ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్నోసర్వ్ వాల్‌మార్టు ఫౌండేషన్ అసోసియేట్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కాఫీ పొడి తయారీ విధానంపై నమూనా పద్ధతిలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న చెప్పారు. అరకు ప్రాంతంలో విరివిగా పండించే కాఫీకి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు అవగాహన అవసరమన్నారు. కాఫీ పొడి పర్యాటకులు కొనగోలు చేసుకునే విధంగా ఆకర్షణీయ ప్యాకింగ్‌తో తయారు చేసే విధానం వివరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. చక్కటి వాతావరణంలో ఎటువంటి రసాయన ఎరువులు వేయకుండా స్థానికంగా లభించే ఎరువులను ఉపయోగించి సాగుచేసే అరకు కాఫీ ప్రత్యేక రుచిని కల్గి ఉంటుందని, అందుకే అంతర్జాతీయంగా మంచి ప్రాచుర్యం లభించిందని చెప్పారు. ఈ కాఫీ తయారీ విధానం ప్రోసెసింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అర్థ శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ లక్ష్మి, ఇతర విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎదురు వచ్చే వాహనాలు కనిపించని విధంగా ఉన్న మలుపు

ప్రమాదకరంగా తుంపాడ మలుపు

హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని వేడుకోలు

పాడేరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో వంతాడపల్లి నుంచి తుంపాడ మీదుగా హుకుంపేటకు వెళ్లే మార్గంలోని ఓ మలుపు ప్రమాదకరంగా ఉంది. పాడేరు ప్రాంతం నుంచి తుంపాడ, అడ్డుమండ మీదుగా హుకుంపేట వెళ్లేందుకు మార్గం ఉంది. మైదాన ప్రాంతం నుంచి హుకుంపేట, అరకులోయ వెళ్లే వాహనదారులు పాడేరు వెళ్లకుండా మండలంలో వంతాడపల్లి నుంచి అడ్డుమండ మీదుగా అరకులోయ వెళుతుంటారు. దీంతో ఈ మార్గం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అయితే వంతాడపల్లికి సమీపంలో తుంపాడ పెద్ద చెరువు వద్ద ఉన్న మలుపు ఇరుకుగా ఉండడంతో తరచూ అక్కడ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రధానంగా ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకుపోవడం లేదా ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొట్టడం జరుగుతున్నాయి. దీంతో ప్రమాదకరంగా ఉన్న ఆ మలుపును వెడల్పు చేయడంతో పాటు అటు, ఇటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

అప్పుల బాధ భరించలేక రైతు ఆత్మహత్య



అప్పలనాయుడు (ఫైల్)

బుచ్చెయ్యపేట (అనకాపల్లి జిల్లా), జూలై 9: అప్పుల బాధ భరించలేక ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం రాజాం గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మరిసా అప్పలనాయుడు (45)కు భార్య లక్ష్మీ, ఇద్దరు సంతానం ఉన్నారు. అప్పలనాయుడు సుమారు ఎకరా సొంత భూమితో పాటు కొంత కౌలుకు తీసుకుని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇటీవల ఇంటి నిర్మాణానికి కొంత అప్పుచేశారు. వ్యవసాయంతో పాటు ఇంటి నిర్మాణానికి సుమారు రూ.15 లక్షలు అప్పు చేయడంతో వడ్డీలు పెరిగిపోయాయి. సాగు కలిసి రాకపోవడంతో భయాందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పొలంలోనే పురుగులు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఈ విషయాన్ని గమనించిన తోటి రైతులు కుటుంబీకలకు సమాచారం ఇవ్వగా, వారు హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు రిఫర్ చేయగా, పరిస్థితి అత్యంత విషమంగా మారడంతో అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అప్పలనాయుడు మంగళవారం మృతిచెందారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

రహదారుణం

... 5వ పేజీ తరువాయి

ఉత్పత్తులు సంతలకు తరలించే సమయంలో వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. ఆటోలు, ద్విచక్రవాహనాలు ఈమార్గంపై ప్రయాణించడం వల్ల తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి.

బస్సు సర్వీసు రద్దు..

పెద్దగెడ్డ-కొండవంచుల గ్రామాలకు గతంలో పీటీడీ బస్సు సర్వీసు ఉండేది. నర్సీపట్నం డిపోకు చెందిన బస్సు చింతపల్లి నుంచి ప్రతి రోజూ నాలుగు సార్లు తిరిగేది. అయితే రహదారి అత్యంత అధ్వానంగా తయారైందని పీటీడీ అధికారులు బస్సు సర్వీసును రద్దు చేశారు. బస్సు సర్వీసును పునరుద్ధరించాలని గిరిజనులు పీటీడీ అధికారులను కోరగా.. రహదారి మరమ్మతులు చేపడితే బస్సును నడుపుతామని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వం రహదారి మరమ్మతులు చేయకపోవడంతో బస్సు సర్వీసును పీటీడీ అధికారులు నడపలేదు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడంతో పెద్దగెడ్డ-కొండవంచుల రహదారి నిర్మాణాలపై ఆదివాసీల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వమే రహదారి నిర్మాణాలకు రూ.1.75కోట్లను విడుదల చేసింది. ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వం రహదారి నిర్మాణాలు చేపట్టేందుకు కనీస చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని మంత్రి నారా లోకేశ్‌ని కలిసిన గిరిజన ప్రాంత టీడీపీ నేతలకు హామీ ఇచ్చారు. ఈ మేరకు అసంపూర్తిగా నిలిచిపోయిన రహదారులు, కనీస రహదారి సదుపాయం లేని గ్రామాలకు మోక్షం కలుగుతుందని టీడీపీ నాయకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ రహదారికి కూటమి ప్రభుత్వ హయాంలో మంచి రోజులు వస్తాయని ఆదివాసీలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సీఎం రాక రేపు

... 5వ పేజీ తరువాయి

నుంచి 12 గంటలకు బయలుదేరి విజయనగరం జిల్లా భోగాపురం వెళతారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు అంతర్జాతీయ విమానాశ్రయం పనులపై సమీక్షిస్తారు. అక్కడి నుంచి 1.50 గంటలకు బయలుదేరి ఏపీ మెడ్‌టెక్ జోన్‌కు చేరుకుంటారు. 2.30 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం ఆ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సీఐఐ వర్చువల్ సమావేశంలో పాల్గొంటారు. రెండు కొత్త భవనాలను ప్రారంభిస్తారు. అక్కడి సిబ్బందితో ముచ్చటిస్తారు. సాయంత్రం 4.35 గంటలకు బయలుదేరి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లో సాయంత్రం ఆరు గంటలకు సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. 6.10 గంటలకు విమానంలో బయలుదేరి విజయవాడ వెళతారు.

హోం మంత్రి మెడ్‌టెక్ జోన్ సందర్శన

ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా ఈ నెల 11న ఉమ్మడి విశాఖ జిల్లా పర్యటనకు వస్తున్నందున పక్కాగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ తదితరులతో కలిసి ఆమె ఏపీ మెడ్‌టెక్ జోన్‌ను మంగళవారం సాయంత్రం సందర్శించారు. అక్కడ కొందరు అధికారులు నిర్లిప్తంగా ఉండడం గమనించి వారిని హెచ్చరించారు. ఇది సీఎం కార్యక్రమమని, ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ 11వ తేదీ మధ్యాహ్నం 1.45 గంటలకు సీఎం మెడ్‌టెక్ జోన్‌కు చేరుకుంటారన్నారు. 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు సీఐఐ ఆధ్వర్యంలో జరిగే జాతీయ మండలి సదస్సులో పాల్గొంటారన్నారు. ఆ తరువాత 4.30 గంటల వరకు మెడ్‌టెక్ జోన్ ఉద్యోగులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని, అది ముగిసిన తరువాత అక్కడ కొత్తగా నిర్మించిన రెండు తయారీ యూనిట్లను ప్రారంభిస్తారని వివరించారు. ఆపై విమానాశ్రయానికి చేరుకొని అక్కడ లాంజ్‌లో విశాఖ నగరంలో మౌలిక వసతులు, మెట్రో రైలు ప్రాజెక్టు, ఎన్‌హెచ్‌ఏఐ, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ తదితర సంస్థల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు. ఈ సమావేశంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌ఓ మోహన్‌కుమార్, ఆర్‌డీఓలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ జగదీశ్వరరావు, ఆర్ అండ్ బీ, ఈపీడీసీఎల్ ఎస్‌ఈలు, జెడ్పీ సీఈఓ, మెడ్‌టెక్ జోన్ అధికారులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

చింతపల్లి, జూలై 9: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. మంగళవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈ నెల 14వ తేదీ వరకు చింతపల్లి, పాడేరు, అరకు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా 0.7 నుంచి గరిష్ఠంగా 12 ఎంఎం వర్షపాతం నమోదవుతుందని ఏడీఆర్ తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

సీలేరు, జూలై 9: సీజనల్ వ్యాధులపై అప్రమత్త అవసరమని గుమ్మిరేవుల సర్పంచ్ ముర్ల కమలమ్మ చెప్పారు. పంచాయతీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, దోమల నివారణకు ఏసీఎం స్ప్రేయింగ్‌ను చేయించుకోవాలని సూచించారు. కొండజర్త గ్రామానికి పాఠశాల మంజూరు చేయాలని, పరమశింగవనం గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలంటూ వినతులు అందాయని, వీటిని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటరమణ, నాయకులు ముర్ల నారాయణరావు, చల్లారావు, బోదరాజు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మొక్కలు నాటాలి

పాడేరు రూరల్, జూలై 9: ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతలను చేపట్టాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి కోరారు. కళాశాల ప్రాంగణంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు, వలంటీర్లు, అధ్యాపకులు మంగళవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి పెంచే కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో చేపట్టాలన్నారు. పర్యావరణ సమతుల్యాన్ని కాపాడటంలో మొక్కలు ప్రధాన భూమికను పోషిస్తాయన్నారు. ప్రతీ వ్యక్తి తల్లి రుణం తీర్చుకోవాలని భావిస్తారని, వారంతా తల్లి పేరుతో మొక్కను నాటి సంరక్షించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్, అధ్యాపకులు ఎ.మురళీధరరావు, పి.కోటేశ్వరరావు, టి.కొత్తంనాయుడు, ప్రసాద్‌నాయుడు, కె.అప్పలనాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు పి.రమేష్‌బాబు, జి.గౌరీశంకరరావు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

డుంబ్రిగుడ, జూలై 9: క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎస్ఐ సంతోష్ కుమార్ అన్నారు. మండలంలోని పోతంగి పంచాయతీ కోసంగుడ గ్రామ యువతకు మంగళవారం వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు సన్మార్గంలో నడవాలని సూచించారు. అనేక మంది యువకులు చెడు వ్యసనాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శతశాతం విద్యార్థుల హాజరు ఉండాలి

చింతపల్లి, జూలై 9: పాఠశాలల్లో శతశాతం విద్యార్థుల హాజరు ఉండాలని ఎంపీడీవో వీర సాయి బాబు ఆదేశించారు. మంగళవారం చిన్నగెడ్డ ఎంపీపీ పాఠశాలను సందర్శించారు. తొలుత విద్యార్థుల విద్య ప్రగతి, మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థులు శతశాతం హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు పాఠశాలకు దూరమైతే గృహానికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కామేశ్వరరావు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు





అక్రమ కట్టడాన్ని తొలగిస్తున్న సిబ్బంది.. పర్యవేక్షిస్తున్న అధికారులు

డుంబ్రిగుడ, జూలై 9: మండలంలోని అరకు సంతబయలు గ్రామంలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను అధికారులు తొలగించారు. అరకు-పాడేరు ప్రధాన రహదారిలో హైవేను ఆనుకుని ఉన్న స్థలంలో గిరిజనేతరుడు అక్రమంగా నిర్మిస్తున్న శాశ్వత గృహానికి పంచాయతీరాజ్ శాఖ, రెవెన్యూ అధికారులు పలుమార్లు నోటీసులు జారీ చేసినా ధిక్కరించడంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీస్ శర్మ తహసీల్దార్, నేషనల్ హైవే సిబ్బందితో వెళ్లి తొలగించారు.

విద్యుత్ సమస్య పరిష్కరించరూ...

ముంచంగిపుట్టు, జూలై 9: మండలంలోని మారుమూల బూసిపుట్టు పంచాయతీలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. తమ పంచాయతీ కేంద్రానికి వచ్చిన విద్యుత్ వైర్లలో తరచూ సాంకేతిక లోపం తలెత్తుతున్నదని, దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నదని వారు తెలిపారు. చిన్నపాటి గాలి వీచినా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, కొన్ని సందర్భాల్లో రెండు, మూడు రోజుల పాటు అంధకారంలో మగ్గాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సుమారు మూడు రోజులు పాటు విద్యుత్ సరఫరాకు అవరోధం ఏర్పడిందని వారు తెలిపారు. ఫలితంగా రాత్రి వేళలు, అత్యవసర పరిస్థితుల్లో సైతం ఇళ్ల నుంచి బయటకు రాలేని దుస్థితి దాపురిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బూసిపుట్టులో విద్యుత్ సరఫరా ఉండేలా తగిన చర్యలు చేపట్టాలని వారు వేడుకున్నారు.

టెన్త్ సిలబస్‌లో మోదకొండమ్మ విశిష్టత పొందుపర్చడం హర్షణీయం

పాడేరు రూరల్, జూలై 9: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, గిరిజన ప్రాంత ప్రజల ఇలవేల్పు పాడేరు మోదకొండమ్మ విశిష్టతను పదో తరగతి తెలుగువాచకంలో పొందుపర్చడం హర్షణీయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్‌కుమార్ అన్నారు. ప్రతి ఏటా మే నెలలో మూడు రోజుల పాటు జరిగే మోదకొండమ్మ ఉత్సవాలను గతంలో టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర ఉత్సవాలుగా గుర్తించినట్టు చెప్పారు. ఈ ఏడాది అమ్మవారి గొప్పతనాన్ని టెన్త్ సిలబస్‌లో చేర్చడం ఆనందదాయమని చెప్పారు.